9న జిల్లాకు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-కడప ప్రతినిధి



ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 న కడప జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజక వర్గంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటకు రానున్నారు. పలు అభివృద్ధి పనుల పరిశీలన, ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన అనంతరం తొలిసారి జిల్లాకు రానున్న నేపథ్యంలో జిల్లా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ పాలన

- డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రజల కోసం పని చేస్తోందని ఆ దిశగా జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆధ్వర్యంలో ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ జిల్లాలో ఏదైనా కల్వర్టులు, బ్రిడ్జిల మరమ్మతులు ఉంటే వెంటనే వాటికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. సంక్రాంతిలోగా నాణ్యతగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఆర్అండ్‌బి శాఖ ద్వారా వివిధ పథకాల కింద జరుగుతున్న పనుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకొని తగు సూచనలు జారీ చేశారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల కోసం ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం, ప్రజలకు పారదర్శక పాలనను అందించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సక్రమంగా, విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యతన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. ముందుగా ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ శాఖల వారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా మంత్రికి వివరించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ పథకంలో భారీ అవినీతి చోటు చేసుకుందని, దీనిపై ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ ఎంక్వైయిరీ పూర్తయినా కూడా నిజాలు వెల్లడి కాకపోవడంతో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇళ్లను కూల్చేసి జగనన్న కాలనీని నిర్మించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ నిర్వహణ సరిగాలేదని, సరైన మౌలిక వసతులు లేవని తక్షణమే ప్రయివేటు రెంటేడ్ భవనంలోకి మార్పు చేయడం కానీ, లేదా అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ భవనాన్ని కానీ కేటాయించాలని.. మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు తెలిపారు. కడప కార్పొరేషన్ పరిధిలో దాదాపు 15 వేల కుటుంబాలకు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, జల్ జీవన్ మిషన్ పథకం నిధుల దుర్వినియోగం జరుగుతోందని పరిశీలించాలని కోరారు. కడప రిమ్స్‌లో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, పిహెచ్‌సిలలో వైద్య సేవలు విస్తృతం చేయాలని కోరారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ కొండాపురం 108 అంబులెన్స్ సేవలు నిలిచిపోయాయని, సేవలను పునరుద్ధరించాలని తెలియజేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీలో వర్ష కాలంలో కుడా నీటి ఎద్దడి నెలకొందని, డిఎంఎఫ్ నిధుల నుండి అవసరమైన నిధులను విడుదల చేయాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి సవిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఒకవైపు సంక్షేమ పథకాలను సంతృప్త స్థాయిలో ప్రజలకు అందిస్తూనే గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ నష్టాలను పూడ్చుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిపిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ సమన్వయంతో ముందుకు సాగాల న్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అనేక అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఎమ్మెల్సీఎం.వి.రామచంద్రారెడ్డి, బద్వేలు, మైదుకూరు, రాజంపేట ఎమ్మెల్యేలు డాక్టర్ దాసరి సుధా, సుధాకర్ యాదవ్, ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఇన్‌చార్జి డిఆర్‌ఒ శ్రీనివాసులు, ఆర్‌డిఒలు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులుపాల్గొన్నారు.

తెల్లబంగారానికి చీడపీడలు

ఎండిపోతున్న పత్తి పంట - బెంగ తీరేదెట్టా - రైతుల్లో తీవ్ర ఆందోళన

తెగులుతో ఎండిపోతున్న పత్తి పంట

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తెల్లబంగారంగా చెప్పుకునే పత్తి పంటను చీడ, పీడలు వెంటాడుతన్నాయి. పత్తి పంటకు తెగులు సోకడం, లద్దెపురుగు విజృంభిస్తుండడంతో రైతులకు శాపంగా మారింది. ప్రతి చేలో ఏదోక రోగం సోకి పంట దెబ్బతింది. ఈ ఏడాది ఎండు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంది. అంతేకాక దాదాపు నెల రోజులపాటు వర్షం లేకపోవడంతో ఆకులు ఎండి రాలిపోయాయి. డిసెంబరు వరకు పచ్చగా ఉండాల్సిన పొలాలు నెల ముందుగానే ఆకులు రాలి ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదలు కాసిన కాయలు గింజ కట్టకుండానే పగిలాయి. ముందుగా పగిలిన పత్తి బరువు తూగదని రైతులు అల్లాడిపోతున్నారు. పదిహేను రోజుల కిందట వర్షం ఉంటే పూతంతా కాతగా మారేది. చెట్లు ఎండిపోయాక వర్షం కురిసిందని, ఈ వానతో ప్రయోజనం లేదంటున్నారు. మూడు సార్లు పత్తి ఏరాల్సి ఉండగా, ఒకే దఫాతో పత్తి సేకరణ పూర్తయ్యేలా ఉందని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది పత్తిలో లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉంది. మాయదారి చీడ రైతుల ఆశలను తొలిచేసింది. కాయలు పెరిగే దశలో పురుగు ఎక్కువకావడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. రోజుల వ్యవధిలోనే ఆకు, పూత, పిందె, కాయలను తినేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పురుగు నియంత్రణకు రైతులు పాడరానిపాట్లు పడుతున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి మందులు స్ప్రే చేస్తున్నారు. గతంలో ఒకేసారి పురుగు మందు స్ప్రే చేస్తే లార్వా నుంచి పురుగుల వరకు నాశనం అయ్యేవి. పురుగులను అదుపు చేసేందుకు ఒక్కో రైతు మూడు సార్లు మందులు పిచికారీ చేశారు. మందు స్ప్రే చేసిన వారం పదిరోజుల్లో చేలల్లో పురుగులు మళ్లీ కనిపిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన విస్తీర్ణం.. తగ్గనున్న దిగుబడి

ఈ సీజన్‌లో జిల్లాలో గతేడాది కంటే ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో పత్తి సాగు విస్తీర్ణం పెరిగింది. సాగు విస్తీర్ణం పెరిగినప్పటికీ ప్రతికూల పరిస్థితులు, చీడపీడల కారణంగా దిగుబడులు తగ్గనున్నాయి. చెట్టుకు వందకుపైగా కాయలు ఉండాలి కానీ.. 20 నుంచి 25 మాత్రమే ఉన్నాయి. ఉన్న కాయలు కూడా సైజు పెరగడం లేదని అంటున్నారు. సాధారణంగా ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుంది. అలాంటిది 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రావడమే కష్టమని రైతులు అంటున్నారు.

సగం చేను ఎండిపోయింది

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశాను. మొదట మంచి గా ఎదిగింది. పదిహేను రోజుల కిందట తెగులు సోకింది. వారం పది రోజుల్లోనే సగం చేను ఎండిపోయింది. మిగతా చెట్లు కూడా వడలిపోతున్నాయి. ముం దుగా కాసిన కాయలే తప్ప, ఆ తర్వాత వచ్చిన పూత కాత రాలిపోయింది. ఏటా మూడు సార్లు పత్తి ఏరే వాళ్లం.. ఈ సారి ఒక్క సారికే చేను ఖాళీ అయ్యేలా ఉంది.

- గంగమ్మ, పత్తి రైతు, పెర్నపాడు, వేముల మండలం

లద్దె పురుగు లొంగడం లేదు

పొగాకు లద్దెపురుగు పత్తికి తీవ్రంగా నష్టం చేస్తోంది. ఈ ఏడు వర్షాలు లేక చేలు సరిగ్గా ఎదగనే లేదు. పూత, కాతను దక్కించుకుందామంటే లద్దె పురుగు దాపురించింది. పురుగులు ఆకులను మేసి జల్లెడలా మారుస్తున్నాయి. రెండుమూడు రోజుల వ్యవధిలోనే చేనంత మేసేస్తున్నాయి. పూత, గూడ, కాయలను తినేస్తున్నాయి. ఇప్పటికి మూడు సార్లు పురుగు మందు పిచికారీ చేశాను. మందుకు పురుగులు లొంగడం లేదు. పురుగు మందులకు వేలకు వేలాది రూపాయలు ఖర్చవుతోంది.

- నాగేశ్వర్‌రెడ్డి, రైతు, లింగాల

వర్షాభావంతో తగ్గిన దిగుబడి

నాలుగు ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నా.. వర్షాలు మొదట్లో మంచిగా కురిశాయి. దీంతో చెట్లు ఏపుగా పెరిగినా కాయలు లేవు. కొంత పూత దశలో ఎండ వేడికి రాలిపోగా.. మరికొన్ని కాయలు వచ్చిన తర్వాత రాలిపోయాయి. చెట్టుకు 20 కాయలకు మించి లేవు. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- రామచంద్రారెడ్డి, రైతు కొండ్రెడ్డిపల్లి, వేముల మండలం

ఎమ్మెల్యే అనుచరులకు ఏంపని? : డిప్యూటీ మేయర్

- హక్కుల కోసం ఎస్‌పిని కలిసిన కార్పొరేటర్లు

మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవి అనుచరులకు ఏమి పని అని డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు ప్రశ్నించారు. మంగళవారం ఎస్‌పిని కలిసి హక్కులను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్ల సీట్లను ఎమ్మెల్యే మాధవి అనుచరులు ఆక్రమించి కూర్చున్నారని విమర్శించారు. వైసిపికి చెందిన కార్పొరేటర్ల భర్తలను పోలీసులు కనీసం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోకి కూడా అనుమతించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 7 నిర్వహించే సర్వసభ్య సమావేశంలో తమకు రక్షణ కల్పించాలని ఎస్‌పిని కోరారు. కార్పొరేటర్లు, కో - ఆప్షన్ మెంబర్లు మినహా ఎవరిని సమావేశ మందిరంలోకి అనుమతించవద్దని పేర్కొన్నారు. టిడిపి నేతలు లోపలికి చొరబడితే అనవసర గొడవలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. మహిళా కార్పొరేటర్లుగా తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

గన్ పెట్టి దోచుకుని, దాచుకున్నారు

- జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు
- ఉక్కు పరిశ్రమకు మూడు సార్లు శంకుస్థాపన
- అభివృద్ధిపై చర్చకు వైసిపి సిద్ధమా!
- మీడియా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత

ప్రజాశక్తి- కడప అర్బన్

వైసిపి పాలనంతా అధికారులపై గన్ను పెట్టి ప్రజా ప్రతినిధులు, నాయకులు దోచుకొని, దాచుకున్నారని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటటి సారిగా కడపకు వచ్చానని చెప్పారు. జిల్లా అభివృద్ధిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించామని ఎక్కడ అభివృద్ధి చేసినట్లు అధికారులు చెప్పలేదన్నారు. వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం అని స్పష్టంగా తెలిసిపోతుందని చెప్పారు. జిల్లా అభివృద్ధిపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లే పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి, కడప ఎంపీ అవినాష్ రెడ్డి సమావేశానికి హాజరు కాలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేస్తూ ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆస్తులను దోచుకునేందుకు తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నయుడు రద్దు చేశారని గుర్తు చేశారు. జగన్ పాలనలో జాబు వస్తుందని ఫ్యాన్ తెచ్చుకుంటే, విద్యార్థులు ఆఫ్ ఫ్యానుకే ఉరి వేసుకునే పరిస్థితి తెచ్చారని విమర్శించారు. రూ.3 వేల పెన్షన్ ఇచ్చేందుకు వైసిపికి ఐదు సంవత్సరాలు పట్టిందని వాపోయారు. సర్పంచ్ నిధులను కూడా దోచేశారని చెప్పారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలో రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి మీరే గుంతలు తీసి మీరే పూడుస్తున్నారని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ పులివెందులలో గెలవడం కూడా కష్టమే అన్నారు. వైసిపి నాయకుల బెదిరింపులకు ఇక్కడ భయపడేవారు ఎవరు లేరని హెచ్చరించారు. పులివెందుల మెడికల్ కళాశాలలో ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో విద్యార్థులకు కేంద్రం సీట్లు కేటాయించలేదని చెప్పారు. సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు, కృష్ణ జట్ల మ్యాచ్ డ్రా

ప్రజాశక్తి - కడప : వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నెల్లూరు, కృష్ణ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 246 పరుగులు చేసింది. కృష్ణ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 258 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ సాయి 73, భాను చైతన్య 39 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుశాంత్ రెండు వికెట్లు తీసుకున్నాడు. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో కృష్ణా జట్టు ఆధిక్యత సాధించింది. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో శ్రీకాకుళం, అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 130 పరుగులు చేసింది. మూడు వికెట్లు నష్టానికి 156 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 81.5 ఓవర్లలో 315 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని నేత్ర కిరణ్ 113 పరుగులు (సెంచరీ) చేశాడు. వివేకానంద 148 పరుగులు సెంచరీ చేశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 53.0 మూడు వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్ లో శ్రీకాకుళం జట్టు అధికత సాధించింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో గుంటూరు, విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో గుంటూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 313 పరుగులు చేసింది. విజయనగరం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 50.0 ఓవర్లలో 177 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి నందన్ 65 పరుగులు చేశాడు. విజయనగరం జట్టులోని ప్రణీత్ 3 వికెట్లు తీసుకున్నాడు. గుంటూరు జట్టు విజయనగరం జట్టుకు ఫాలో ఆన్ ఇచ్చింది. దీంతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన విజయనగరం జట్టు ఆట ముగిసే సమయానికి 40.0 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. మ్యాచ్ డ్రాగా ముగిసింది.

'వైవీయూ'కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయ 2వ దశ అంతర కళాశాలలో పోటీలలో విశ్వవిద్యాలయ కళాశాల ఓవర్ ఆల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. విశ్వవిద్యాలను అంతర కళాశాలలు భాగంగా వ్యాయామ విద్య, క్రీడా శాస్త్రాల విభాగంలో ఈనెల 3న నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, రైఫిల్ షూటింగ్, బెస్ట్ ఫిజిక్ క్రీడలలో అత్యధిక పతకాలు సాధించి తన ఘనతను సాటింది. పతకాలు సాధించిన క్రీడాకారులను విశ్వవిద్యాలయ విసి ఆవార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్యులు పి.పద్మ, కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, వ్యాయామ విద్య క్రీడా శాస్త్రాల విభాగ అధిపతి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి అభినందించారు.

క్రీడాకారులను అభినందిస్తున్న విసి కృష్ణారెడ్డి

నగరంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - కడప అర్బన్

కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి మార్నింగ్ విసిట్‌లో భాగంగా పకీరుపల్లె, కొత్త బస్టాండ్, ఐటిఐ సర్కిల్, మున్సిపల్ గ్రౌండ్ ప్రాంతాలను శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పకీరుపల్లె ప్రాంతాన్ని పరిశీలనలో భాగంగా, ఓం శాంతి నగర్, నిరంజన్ నగర్ కనెక్టింగ్ రోడ్లను పరిశీలించారు. ఆ ప్రాంతంలో చెత్త కుప్పలు ఎక్కువగా ఉండటం వల్ల వాటిని వెంటనే తొలగించాల్సిందిగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెత్తను రోడ్లపై వేసే వారిపై జరిమానా విధిం చాలని శానిటేషన్ విభాగానికి సూచించారు. పిచ్చి మొక్కలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. కొత్త బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను నాణ్యతలోపాలు లేకుండా తక్షణంలో పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. బస్టాండ్‌లో నీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆర్‌టిసి సిబ్బందిని, ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, అసిస్టెంట్ ఇంజినీర్ ప్రతాప్ రెడ్డి, కృష్ణ, పవన్, శానిటేషన్ సిబ్బంది, ఆర్మీ రిక్రూట్మెంట్ ఆఫీసర్లు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌యు బిఒఎస్ చైర్మన్‌గా మృత్యుంజయరావు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ లలితకళా విభాగం అధిపతి డాక్టర్. కోట మృత్యుంజయరావు గుంటూరు నాగార్జున యూనివర్సిటీ, లలిత కళా విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ (బిఒఎస్) చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో రెండేళ్లపాటు కొనసాగుతారు. లలితకళలపై వివిధ అంశాలపై సుమారు 50కి పైగా జాతీయ, అంతర్జాతీయ పరిశోధన పత్రాలను ప్రచురించడంతో పాటు , మూడు పుస్తకాలను ముద్రించారు. లలిత కళా రంగంలో సిలబస్ రూపకల్పన లో విశేష అనుభవం కలిగి పలు రాష్ట్ర, జాతీయ స్థాయి సదస్సులు నిర్వహి ంచారు.ఆయన ఎంపిక పట్ల వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ , ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

డిఎస్‌పికి సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్



డిఎస్‌పిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ సంఘం నాయకులు

కడప డిఎస్‌పి వెంకటేశ్వర్లును మంగళవారం ఎపి ఎన్‌జిఒ జిల్లా నాయకులు కలిసి శాలువా, బొకేతో సన్మానించారు. సన్మాని ంచిన వారిలో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, సహా అధ్యక్షులు టి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు, టి. శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శి యన్. రాజశేఖర్, కడప సిటీ అధ్యక్షలు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పద్మనాభం ఉన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

సత్ప్రవర్తనతో మెలగాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 'బాలల పరిరక్షణ-కిశోర వికాసం'పై అవగాహన, బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం వంటి వాటి గురించి వివరించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు ఏ పని చేసినా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే అనుకున్న గమ్యాన్ని చేరుకుంటారని తెలిపారు. 18 ఏళ్లలోపు పిల్లలందరూ చట్టం పరిధిలోకి వస్తారని, వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అలా ంటి వారి కోసం మిషన్ వాత్సల్య ద్వారా అందిస్తున్న పథకాలు తెలి పారు. మంచి చెడులను గ్రహిస్తూ అవగాహనతో నడుచు కున్న ప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో లక్ష్మీప్ర సన్న, ప్రత్యూష, సూపర్‌వైజర్లు, అధ్యాపకులు, ప్రిన్సిపల్ శోభారాణి పాల్గొన్నారు.

వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్ : 'దేశంలో విద్యారంగంపై సాంకేతికత ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలకు విద్యార్థుల నుంచి విస్తృత స్పందన లభించింది. మంగళవారం యోగి వేమన విశ్వవి ద్యాలయం మైనారిటీ సెల్, బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్ విభాగం కన్వీనర్ ప్రొఫెసర్ రియాజున్నీసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీల్లో యూనివర్సిటీలోని వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలకు పదును పెట్టారు. విద్యారంగం సాంకేతికత రెండు వేరు చేసి చూడలేనంతగా కలిసిపోయాయని విద్యార్థుల మాటల్లో తెలిపారు. న్యాయనిర్ణేతలుగా సైకాలజీ సహ ఆచార్యులు డాక్టర్ కె. లలిత, జెనెటిక్స్ అండ్ జెనోమిక్స్ విభాగం సహ ఆచార్యులు మునికుమారి, ఉర్దూ విభాగం అధ్యాపకులు వ్యవహరించారు. విజేతలకు జాతీయ విద్యా దినోత్సవం రోజున బహుమతులు ప్రదానం చేస్తామని రియాజున్నిసా తెలిపారు.

వైవీయూలో పరిసరాల శుభ్రత

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగివేమన విశ్వవిద్యాలయంలో సివి రామన్ ప్రాంగణం పరిసరాలలో స్వచ్ఛత కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్ - 2 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ, డాక్టర్ ఎస్.సుమిత్ర ఆధ్వర్యంలో జువాలజీ పర్యావరణం విభాగం వలెంటీర్లు పరిసరాలను శుభ్రం చేశారు. ప్రొగ్రాం కో- ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి.రామిరెడ్డి, వైవీయూ ఇంజినీర్లు వాలంటీర్లకు పలు సూచనలు చేశారు.

విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి -కడప అర్బన్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొండాపురం రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు పాము కాటుకు గురైనా ప్రిన్సిపల్ పట్టించుకోవడం లేదని, జిల్లాలో అనేక విద్యా రంగపరమైన సమస్యలున్నాయని, వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎద్దుల. రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్య దీవెన, వసతి దీవెన రూ.3,480 బకాయిలు విడుదల చేయాలని, జీవో నంబర్ 77ను రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించేలా చూడాలని పేర్కొన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని తెలిపారు. హాస్టల్ సొంత భవనం ఏర్పరచాలని, జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు మౌలిక వసతులు కలిపించాలని చెప్పారు. జమ్మలమడుగు నియోజకవర్గం, కొండాపురం రెసిడెన్షియల్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థినిలను రాత్రి పాము కరిస్తే ఉదయం హాస్పిటల్ తీసుకెళ్లడం చాలా దారుణమని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్ పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన లక్ష్మీరెడ్డి

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని సవితను మంగళవారం నగరంలోని బిల్డప్ వద్ద ఉన్న పుత్త ఎస్టేట్‌లో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఆలం ఖాన్ పల్లె లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ ఉమాదేవి గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల కోసం, చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. ఆయనతో ప్రతి ఒక్కరూ కలిసి అడుగు ముందుకేసి రాష్ట్ర అభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పరిపాలన, అభివృద్ధి సంక్షేమం రెండింటిని ప్రజలకు అందిస్తూ ముందుకెళుతున్నారని తెలిపారు.

కడప : జిల్లా ఇన్చార్జి మంత్రి సవితను టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ ఆర్అండ్‌బి అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.





మంత్రి సన్మానిస్తున్నవికాస్ హరికృష్ణ, కార్పొరేటర్ ఉమాదేవి

కడప అభివృద్ధికి కృషి చేద్దాం

- సమన్వయ సమావేశంలో మంత్రి సవిత

ప్రజాశక్తి-కడప ప్రతినిధి/కడప అర్బన్

కడప జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని ఇన్‌ఛార్జి మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కూటమి నేతలతో మంత్రి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇకపై జిల్లా పర్యటనకు తరుచూ వస్తానన్నారు. సమన్వనయ భేటీ సందర్భంగా ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో మంత్రి సవిత భేటీ అయ్యారు. అనంతరం నియోజకవర్గాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2019-24లో జగన్ అరాచక పాలనపై కూటమి నాయకులు సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. గత ప్రభుత్వ అసమర్థ, అరాచక పాలనకు చమరగీతం పాడామన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. గత అయిదేళ్లలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టడంతో పాటు రౌటీ షీట్లను సైతం తెరిచారని తెలిపారు. తనపైనా తప్పుడు కేసుల బనాయించి రాజకీయ వేధింపులకు పాల్పడ్డారన్నారు. అనంతరం జిల్లాలో పలు సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యేలు తీసుకొచ్చారు. సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో చేనేతల పేరుతో బోగస్ పెన్షన్లు తీసుకుంటున్నారని వాటిని తొలగించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి మాట్లాడుతూ జిల్లాలో కస్తూర్బా విద్యాలయాల్లో ఇటీవల చేపట్టిన నియమకాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచారని, వాటిని తొలగించాలని కోరారు. టిడిపి నాయకుడు రితీశ్ మాట్లాడుతూ 2014-19లో నీరు-చెట్టు, ఉపాధి హామీ పథకం చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరారు. అంతకుముందు దూదేకుల సంఘం నాయకులు ఖాదర్ బాషా అధ్యక్షతన దూదేకుల పిల్లలు విద్యాపరంగా ఎదుర్కొంటున్న ముస్లిం దూదేకుల శాశ్వత జిఒ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. బిసి, చేనేత సంక్షేమ సంఘం నాయకులు, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకులు సుధాకర్ అధ్యక్షతన చేనేతల గుర్తిపు కార్డులు, యార్న్ సబ్సిడీ, మైలవరం టెక్స్ టైల్ పార్క్ పునరుద్ధరిచాలని కోరుతూ వినతి పత్రాలను అందజేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, మాధవి, పుట్టా సుధాకర్ యాదవ్, నాయకులు నర్సింహాలు, రోశన్న, రిబేశ్‌రెడ్డి, పుల్లయ్య, మడక చక్రధర్, జనసేన జిల్లా అధ్యక్షుడు సుంకర శ్రీనివాసులు, బిజెపి జిల్లా అధ్యక్షులు శశిభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటా : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వైసిపి నాయకులు, కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఎంపీ ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలను ఆయనకి విన్నవించారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని ఎంపీ కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే.. పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని వారికి భరోసా ఇచ్చారు.

కిట్లు అందిస్తున్న చైర్మన్ వరప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి

కార్మికులకు పిపిఇ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ది నేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఏకోసిస్టమ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సఫాయి కర్మచారి (సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్) కార్మికులకు ప్రత్యేకంగా పిపిఇ కిట్లను మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్మన్ వరప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి, కౌన్సిలర్లు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాముడు మాట్లాడుతూ సఫాయి కార్మచారి కార్మికులు ఆరోగ్యంగా ఉండాలంటే పిపి కిట్స్ ధరించి విధుల్లో పాల్గొనాలని సూచించారు. సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేసిన అనంతరం కిట్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్, ఖాదర్ బాషా, కో-ఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, సచివాలయం, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు : ఎంఇఒ

ప్రజాశక్తి - ఖాజీపేట

2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చిలో జరుగనున్న పది పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 18వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని ఎంఇఒ నాగస్వర్ణలత తెలిపారు. ఆ మేరకు ఆమె మంగళవారం మాట్లాడుతూ ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు. ప్రభుత్వం మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 11 వరకు మాత్రమే గడువు విధించిందన్నారు. ప్రస్తుతం ఎలాంటి అదనపు రుసుం చెల్లించకుండా ఈనెల 18 వరకు గడువు ఇచ్చిందన్నారు. గడువు దాటితే రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 10వ తేదీ వరకు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ప్రమాదస్థాయి గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో ప్రతి ఇంటికెళ్లి ప్రమాదస్థాయి గర్భిణులను గుర్తించాలని మండల వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుదల, పర్యవేక్షణ, పిల్లల అభివృద్ధి, ఎఆర్ఐ, న్యుమోనియా, పురుషుల కుటుంబ నియంత్రణలో భాగస్వామ్యం, నవజాత శిశువు సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. ప్రమాదస్థాయి గర్భిణులను వెంటనే గుర్తించి వారికి ప్రత్యేక వైద్యసేవలు అందించాలన్నారు. ప్రతి నెల 9న ప్రధాన మంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమానికి వారు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కావ్య మాధురి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్ వైజర్స్ సరస్వతి, బాబూరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి శ్రీవాణి

క్రైం కార్నర్

పట్టుబడిన నిందితులతో సిఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య

గంజాయి కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చెంచుపల్లి చెరువు వద్ద మంగళవారం 1,700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ తెలిపారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో సమాచారం మేరకు తనిఖీ చేపట్టారు. ఇందులో అయిదు మంది అనుమానితులు కనిపించారన్నారు. వారిని విచారించగా గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. గుంటూరుకు చెందిన తిరుమల రావు ప్రొద్దుటూరు శ్రీనివాస్ నగర్‌కు చెందిన మేకల సునీల్, ఎస్.శ్రీనివాసులు. జి.రమేష్, పి.సుధీర్ గంజాయి రవాణా చేస్తున్నట్లు తేలిం దన్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. నింది తులను పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని సిఐ అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

మంగపట్నం గ్రామానికి చెందిన బోడెద్దుల జగదీశ్వర్‌రెడ్డి అనే యువకుడు అదృశ్యమైనట్లు అతని తండ్రి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మంగళవారం హెడ్ కానిస్టేబుల్ రాంబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బోడెద్దుల జగదీశ్వర్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం బిటెక్ చదువుతూ మధ్యలో మానేశాడు. తర్వాత తండ్రికి సాయంగా వ్యవసాయం చేస్తుండేవాడు. నెల రోజులు క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. మళ్లీ రాకపోవడంతో బంధువులు ఇళ్లల్లో, చుట్టుపక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం ఫిర్యాదు చేశారు. సిఐ దస్తగిరి ఉత్తర్వుల మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాంబాబు తెలిపారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

మినుములో తెగుళ్ల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మినుము పంట పరిశీలించి సాగులో మెలకువలు, పల్లాకు తెగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పల్లాకు తెగులు కనిపించిన మొక్కలను గమనించి వెంటనే ఏరి కాల్చేయాలన్నారు. రసం పీల్చే పురుగు ఉధతిని అదుపులో ఉంచేందుకు ముందు జాగ్రత్తగా వేప నూనె 5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పసుపు రంగు జిగురు అట్టలను ఒక ఎకరా పొలంలో 10 నుండి 15 అట్టలు ఏర్పాటు చేస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. వివిధ పంటల్లో బెట్ట రాకుండా కాపాడుకునేందుకు తేమ సున్నిత దశల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామసుధ పాల్గొన్నారు.

చాపాడు : ఖరీఫ్ సీజన్‌లో సాగైన వరి పంటలో ఆకుమడత పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మైదుకూరు డివిజన్ వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి, మండల వ్యవసాయ అధికారి మ్యాగి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చియ్యపాడు, సోమాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట వెన్ను దశలో ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఆకు ముడత పురుగు సోకడంతో పంట తెల్లగా మారుతుందన్నారు. అవసరమైన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలని సూచించారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటలను రైతులు సాగు చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విఎఎలు పుష్పలత, రాము, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

మైదుకూరు మండలం విశ్వనాథపురం, జంగంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ ప్రసన్న మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు అన్నారు. వనిపెంట కెవికె శాస్త్రవేత్తలు శ్రీవిద్య, పిరోజ్ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు ద్రవ జీవామృతం తయారు చేయించారు. కార్యక్రమంలో విహెచ్ఎ మధుసుధన్ రెడ్డి, విఎఎ శ్రావణి, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల వ్యవసాయాధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఇ.కొత్తపల్లెలో ప్రసాద్‌రెడ్డి రైతు అరటి పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అరటితోటను పరిశీలించారు. రసం పీల్చే పురుగు గుడ్లు నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నీమాస్త్రం తయారు చేయించారు. కార్యక్రమంలో పకృతి వ్యవసాయ మాస్టర్ భాస్కర్‌రెడ్డి, విఎఎ హరి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహారెడ్డి, శివ పార్వతి, సుభహాని, లక్ష్మీదేవి, జయలత, రైతులు పాల్గొన్నారు

దువ్వూరు : దువ్వూరు రైతు సేవా కేంద్రంలో రైతులతో వ్యవసాయాధికారులు సమావేశం నిర్వహించారు. ప్రధాన పంటలైన వరి, మినుము, మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులపై కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య అవగాహన కల్పించారు. ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు రైతు సేవా కేంద్రంలో అందుతున్న సేవలను వివరించారు. దువ్వూరు వ్యవసాయ ఉద్యాన సహాయకులు చరణ్, విమల, రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయింది : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాన్ని తాను వైసిపి నాయకుడిగా కాకుండా ఆవేదనతో చెబుతున్నానని స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. చనిపోయిన బిడ్డ మృతదేహాన్ని కూడ కనీసం కనిపెట్టలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఈ 5 నెలల్లో 100 మంది మహిళల ఉసురు పోసుకున్నారన్నారు. శాంతిభద్రతలు కాపాడలేని ఈ ప్రభుత్వం అధికారంలో కొనసాగే అర్హత లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పోలీసు వ్యవస్థపైకి నెట్టడం సిగ్గుచేటన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పక్కాగా నేరాలను అదుపు చేశామన్నారు. పోలీసులపై రాజకీయ జోక్యం మితిమీరిపోవడం వల్లనే ఇలాంటి దుస్థితి నెలకొందన్నారు. ఈ ప్రభుత్వం ఎంతసేపు జగన్‌ను విమర్శించడం, తన పాలన గురించి గొప్పలు చెప్పుకోవడంతోనే సరిపెట్టుకుంటోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి దిశ యాప్‌ను అందుబాటులోనికి తేవాలని ఆయన సూచించారు. ఇకపై ఆడబిడ్డలపై ఒక్క దుర్ఘటన జరిగినా ప్రొద్దుటూరు వేదికగా భారీ ఉద్యమానికి దిగుతామని రాచమల్లు ప్రసాదరెడ్డి హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - చాపాడు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చాపాడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సావిత్రమ్మ తెలిపారు. జిల్లా స్త్రీ,శిశు సంక్షేమ సాధికారత అధికారుల ఆదేశాల మేరకు స్థానిక హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు మిషన్ వాత్సల్య ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల కలిగే పరిణామాలను వివరించారు. ఆడపిల్లల చదువు యొక్క ప్రాముఖ్యత, చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి అవగాహన కల్పించారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ జి.సునీత పిల్లల హక్కుల గురించి వివరించారు. మహిళా పోలీస్ మంజుల 1098 టోల్ ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. కిషోర్ వికాసం ప్రోగ్రాం ఆవశ్యకతను వివరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాబితాను విడుదల చేస్తున్న కొండారెడ్డి, నిర్వాహకులు

సివిల్స్ ఉచిత శిక్షణకు 25 మంది ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

స్థానిక కొర్రపాడు రోడ్డులోని డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సివిల్స్ ఉచిత శిక్షణ అర్హత పరీక్షలో 25 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. రాత, మౌఖిక పరీక్ష ద్వారా వీరిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ, డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణా కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజ కవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ అశోక్ నగర్‌లోని డాక్టర్ లక్ష్మయ్య ఐఎఎస్ అకాడమీలో ఉచిత శిక్షణ తీసుకుంటారన్నారు. గ్రూప్-1,2 పరీక్షల ప్రిలిమినరీకి ఎంపికైన పురుషులకు కూడా ఆన్‌లైన్ ద్వారా అర్హత పరీక్ష పెట్టి ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 99493 32920కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కొండయ్య స్వామి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మండలం తిమ్మాయిపల్లి పూసయ్యగారి ఆశ్రమంలో అవధూత కొండయ్య స్వామి పుట్టినరోజు వేడుకలను భక్తులు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి వేలాదిగా కొండయ్య స్వామి భక్తులు స్వామి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు తరలి వచ్చారు. కోలాటం, చెక్కభజన వంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో కేక్ కట్ చేశారు. మూడు రోజుల పాటు అన్నదానం, పూజలు నిర్వహించనున్నారు. రాత్రి జబర్దస్త్ కామెడీ, పాటల కార్యక్రమం ఆకట్టుకున్నాయి. డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ, ఎస్ఐ పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తేన్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ దినేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. వేంపల్లె గ్రామంలోని పాత బాలికల పాఠశాల, బాలిశెట్టి వీధి, బాలుర పాఠశాల, వైఎస్ఆర్ పార్కు ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. జీవాల మార్కెట్, రంగయ్య హాస్పిటల్, శ్రీనివాస లాడ్జీ, ఆటోస్టాండ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న డాక్టర్ చెరసాల యోగాంజనేయులు

క్రమశిక్షణతోనే ఉన్నత స్థాయికి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉంటే ఉన్నత స్థాయికి వెళ్లవచ్చని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ధైర్యశాలి మహిళలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ముందుకు వెళ్లాలని ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ వైఎస్ఆర్ వివేకానంద డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆయన మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. చదువుపైనే ఎక్కువగా శ్రద్ధ పెట్టాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిస్థితులపై అవగాహన పెంచుకొని నడుచుకొంటే బాగుంటుందని సూచించారు. ముఖ్యంగా ఆడ పిల్లలు జాగ్రత్తలు వహించాలని కోరారు. నడవడిక బాగుంటే తల్లిదండ్రులకు కూడా మంచి పేరు తెచ్చిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో మహిళా విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మిదేవి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, కేశమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

10న కార్తీకమాస రెడ్ల వనభోజనం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ నాగనాథేశ్వర కోన దేవస్థానంలో ఈనెల 10న రెడ్ల వనభోజన సమితి ప్రొద్దుటూరు ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెడ్ల వన భోజన సమితి ప్రతినిధులు తెలిపారు. ఆ మేరకు వారు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఇందులో భాగంగా దుంపలగట్టులో వైసిపి నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి వారు ఆహ్వానించారు. కార్యక్రమానికి తప్పక హాజరవ్వాలని సమితి ప్రతినిధులు కోరారు.

పాస్‌పోర్ట్ పోయినది

కడప జిల్లా, వేంపల్లె మండలం, వేంపల్లె గ్రామంలోని డోర్ నెంబర్ 15-233, పక్కీర్ పల్లెలో నివాసం ఉన్న పి. ఫక్రుద్దీన్ S/o బాబు **(L8716010)** కు చెందిన పాసు పోర్టు తీసుకొని జీరాక్స్‌కు వెళ్లుతుండగా వేంపల్లెలోని బ్యాంకు సర్కిల్ వద్ద పోయింది. నా పాస్‌పోర్టు దొరికిన వారు నా అడ్రస్ కు గాని, ఫోన్ 9502651383 కు సమాచారం ఇవ్వగలరు.

మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టిడిపి నాయకులు

మంత్రికి ఘనస్వాగతం పలికిన నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అనంతపురం జిల్లా నుంచి కడపకు వెళుతూ మార్గమధ్యలో పులివెందుల చేరుకున్న బిసి సంక్షేమ శాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితమ్మకు మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, టిడిపి పులివెందుల మాజీ పట్టణ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె వెంకట్రామిరెడ్డి, సారెడ్డి గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టిడిపి కార్యాలయంలో నాయకులతో పలు విష యాలపై చర్చించారు. అనంతరం కడప కలక్టరేట్‌లో జరిగే జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశానికి మంత్రి వెళ్లారు. కార్యక్రమంలో సీనియర్ నాయ కులు మోహన్‌రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, హక్కులగారి విజయ్‌కుమార్ రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై మంత్రికి రైతుల వినతి

వేంపల్లె - వేంపల్లె

వేంపల్లెలోని పాపాగ్ని నది నుండి ఇసుకను వందలాది ట్రాక్టర్లు యథేచ్ఛగా రవాణా చేస్తున్నాయని, వాటివల్ల తమకు నష్టమని కడప ఇన్‌ఛార్జి మంత్రి సవితను రైతులు కోరారు. మంగళవారం పులివెందుల నుండి కడపకు వెళుతున్న మంత్రి సవితను వేంపల్లె ఎన్టీఆర్ సర్కిల్ వద్ద రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. పాపాగ్ని నదిలో ఇసుక రవాణా చేస్తున్న ప్రాంత సమీపంలో వ్యవసాయ భూములు, 20 గ్రామాలకు తాగునీరు అందించే బోర్లు ఉన్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టిందన్నారు. ఇసుక రవాణాతో రైతులు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఇసుక రీచ్‌ల నుండి ఇసుక రవాణా చేసుకొనేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నట్లు పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి, జయచంద్రారెడ్డి, నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, యువనేత రజనీకాంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ వెంకట స్వామి, రామగంగిరెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్, డాక్టర్ కరీముల్లా, సయ్యద్ పీరా సాహెబ్, రెడ్డి కిషోర్, కూటమి నాయకులు, కార్యకర్తలు మంత్రికి ఎన్టీఆర్ సర్కిల్, హనుమాన్ సర్కిల్ వద్ద ఘనస్వాగతం పలికారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ విజయకుమారి

ఆర్‌హెచ్, ఇసితో భూ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - చక్రాయపేట

ఆర్‌హెచ్(రికార్డ్ ఆఫ్ ఓల్డ్) లేదా మాన్యువల్ ఇసి తెస్తే భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ పి.విజయకుమారి పేర్కొన్నారు. మంగళవారం నెరుసుపల్లె సచివాలయం వద్ద మాజీ సర్పంచ్ సానే సుబ్బరామయ్య, రాహుల్ ఆధ్వర్యంలో భూ సమస్య పరిష్కారానికి గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలు పరిష్కారం కావాలంటే పై పేర్కొన్న వాటిలో ఏదో ఒకటి తీసుకురావాలన్నారు. గతంలో జరిగిన ఈ సర్వేలో భాగంగా కొందరికి ఎక్కువగా భూమి వచ్చిందని, మరి కొందరికి భూమి తగ్గిందని వంటి సమస్యలు వచ్చాయన్నారు. దాదాపు 14 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ శివారెడ్డి, వీఆర్వో ప్రసాద్, విఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు.

సొంత నిధులతో సిమెంటు ర్యాంప్

ప్రజాశక్తి - వేంపల్లె

బండలు వేయిస్తున్న ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్

స్థానిక గరుగు వీధిలో ఎంపిటిసి పద్మా రాజ్‌కుమార్ తన సొంత నిధులతో సిమెంటు ర్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ర్యాంప్ లేకపోవడం వల్ల పాదా చారులు, వాహన దారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు సోమవారం ఎంపిటిసి దృష్టికి తెచ్చారు. ఇందుకు ఆయన స్పందించి వీధిలోని ప్రజల సమస్యలను పరిష్కరిం చేందుకు రోడ్డు మధ్యలో సిమెంటు ర్యాంపును ఏర్పాటు చేయించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు. ఆ వీధి ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు.

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

వాహన పత్రాలు తప్పక ఉంచుకోవాలి

వేముల : వాహన పత్రాలను యజమానులు తమ వద్దే తప్పక ఉంచుకోవాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక కడప-పులివెందుల ప్రధాన రహదారి గొందిపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఎస్ఐ వాహనాలను తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహన దారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహ నాలు, కార్లు నడిపేవారు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాలన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి ఇ-చలానా విధించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు

H.M.O.P.No. 132/2022

నారుసల్లి రామభూపాల్‌రెడ్డి, S/o వెంకట నారపురెడ్డి, వయస్సు 28 సం॥లు, వ్యవసాయం వలన జీవనం, R/o. D.No. 1/223, 1వ వార్డు, మదిరేపల్లి గ్రామం, దువ్వూరు మండలం, కడప జిల్లా. **...పిటీషనరు**

Vs

నారుపల్లి వెంకటలక్ష్మి, W/o ఆర్.రామభూపాల్‌రెడ్డి, D/o యనమల క్రిష్ణరెడ్డి, వయస్సు 25 సం॥లు, వ్యవసాయం వలన జీవనం, R/o క్రిష్ణంపల్లి గ్రామం, దువ్వూరు మండలం, కడప జిల్లా.

...రెస్పాండెంట్

నోటీసు

పై నెంబరులోని పిటీషనరు, పై రెస్పాండెంట్ అయిన నీ పై విడాకులు కోరి పై కోర్టుయందు H.M.O.P. ని దాఖలు చేసిఉన్నాడు. అట్టి HMOP యందు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 26.11.2024వ తేదీన ఉదయం 10.30లకు హాజరు కావలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

K.SREENIVASULU
T.PADMJA
Advocates